జెవివి ఆధ్వర్యంలో మూర్ఛవ్యాధి శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైద్య శిబిరానికి వచ్చిన మూర్ఛ బాధితులు

జెవివి జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మూర్ఛవ్యాధి (ఫిట్స్ క్యాంపు) ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా న్యూరాలజీ స్పెషలిస్ట్ శివన్నారాయణ (విజయవాడ) పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ మూర్ఛ వ్యాధి శిబిరానికి అనంతపురంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మొత్తం 130 మంది దాకా మూర్ఛ వ్యాధి రోగులు హాజరైనట్లు తెలిపారు. ఉచితంగా వైద్యం చేసి అతి తక్కువ ధరకు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికిషోర్, జెవివి నగర నాయకులు రామిరెడ్డి, వీరరాజు, ప్రసాద్ రెడ్డి, నూర్ మహమ్మద్, మన్సూర్, శివ చరణ్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తొలగని లంపీస్కిన్ గుబులు

◆ పశువుల చర్మంపై దద్దుర్లు ◆ పాడి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాడి రైతులకు ఇప్పటికీ లంపి స్కిన్ (ముద్ద చర్మం) గుబులు తొలగడం లేదు. గతేడాది ఈ జబ్బుతో పెద్దఎత్తున ఆవులు, దూడలు ఈ జబ్బుబారినపడి చనిపోయాయి. చర్మం ముద్దగా మారి, మేత కూడా తినలేని పరిస్థితుల్లో చనిపోతూ వచ్చాయి. ఒక దాని నుంచి మరొకదానికి అంటు వ్యాధి కూడా కావడంతో నియంత్రించడం ఇబ్బందిగా మారింది. వ్యాక్సిన్ ద్వారా అరికట్టే చర్యలు చేపట్టారు. అయినా ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్కడక్కడ లంపిస్కిన్ జబ్బు బారిన జంతవులున్నాయి.

చాపకింద నీరులా లంపిస్కీన్

లంపిస్కిన్ ఈ ఏడాది చాపకింద నీరులా వ్యాప్తి చెందుతూనే ఉంది. పెద్దపప్పూరు మండలంలో రెడ్డిపల్లితోపాటు మూడు గ్రామాల్లో మూడు ఆవులు దీనిబారినపడి మృత్యువాతపడ్డాయి. మరికొన్ని ఇప్పటికీ దీని బారినపడిన దూడలున్నాయి. అదే విధంగా బొమ్మనహల్ మండలంలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం గ్రామాల్లో ఈ జబ్బుబారిన పడిన పశువులు అత్యధికంగానున్నాయి. పుట్లూరు మండలంలోని లంపిస్కీన్, అదే రకంగా తీవ్రమైన జ్వరాలతోనూ ఏకంగా 40 ఆవులు మృత్యువాతపడ్డాయి. సత్యసాయి జిల్లాలో పలుచోట్ల దీనిబారినపడిన ఆవులు, దూడలున్నాయి. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆవులు, దూడలు చనిపోతాయన్న ఆందోళన పాడి రైతుల్లో నెలకొంది.

వైద్యసేవల్లోనూ ఇబ్బందులు

రోగాల బారినపడిన పశువులకు వైద్యసేవలందించడంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. తగినంత మంది పశువైద్యుల్లేకపోవడంతో కూడా సమస్యగా మారింది. పుట్లూరులోనూ ఇదే రకమైన సమస్య ఉండగా, బొమ్మనహాళ్‌లో పశువుల అంబులెన్సులున్నా ఆశించిన ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది మాత్రం టీకాలు వేయని వాటికి మాత్రమే ఈ ఏడాది వస్తున్నట్టు చెబుతున్నారు.

టీకాలు వేయని వాటికే ఈ జబ్బు

జిల్లాలో అక్కడక్కడా ఈ జబ్బు లక్షణాలున్న మాట వాస్తవమే. గతేడాది జబ్బు వచ్చిన సమయంలో గర్భంతోనున్న వాటికి, దూడలకు ఈ వ్యాక్సిన్ వేయలేదు. ఎందుకంటే గర్భంతోనున్న వాటికి వేస్తే అబార్షన్ అయ్యే అవకాశముంది. అందుకే వేయలేదు. గతంలో వ్యాక్సిన్ వేయని వాటిపైనే దీని ప్రభావముంది. ఎక్కువగా దూడలకు వస్తోంది. గతంలో వేయకుండా మిగిలిపోయిన వాటికి కూడా ఈ ఏడాది వ్యాక్సినేషన్ చేయడం జరుగుతోంది. చాలా వరకు నియంత్రణలోనే ఉంది. పుట్లూరులో ఎక్కువ పశువులు చనిపోయినట్టు తమకు సమాచరమెస్తే వైద్య బృందాన్ని పంపించి పరిశీలించాం. అందులో కొన్ని ప్లాస్టిక్ వంటివి తిని చనిపోయినట్టు తేలింది. మరికొన్ని జ్వరాలతో చనిపోయాయి. లంపిస్కిన్‌తో చనిపోలేదు.

సుబ్రమణ్యం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

కేంద్ర మంత్రి శోభాకరం ధాలాజీ

మహిళా సదస్సులో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి, అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శోభాకరం ధాలాజీ పిలుపునిచ్చారు. సత్యసాయి బాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నాడు ప్రశాంతి నిలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రితో పాటు హెచ్‌హెచ్.రాజమాత ప్రమోదా దేవి వడియార్ పాల్గొన్నారు. ఉదయం సత్యసాయి విద్యార్థులతో కలిసి మహిళలు పెద్ద ఎత్తున సభా వేదిక వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మహిళలను ఉద్దేవించి ప్రసంగించారు. ఈ ఏడాది మహిళా దినోత్సవానికి ప్రశాంతి నిలయానికి రావడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి మహిళా సమానత్వం ఉండాలని కోరుకునేవారన్నారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భారతదేశ సాంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. ప్రపంచ దేశాలు సైతం భారత సాంప్రదాయాలను ఎంతో గౌరవిస్తారని చెప్పారు. సత్యసాయి తన ఆధ్యాత్మిక

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

బోధనలలో కూడా మహిళల పాత్ర గొప్పదని చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. మహిళలు స్వసక్తితో ఎదగాలన్నారు. మహిళా శక్తి ఏమిటో నిరూపించుకోవాలన్నారు. రాజమాత ప్రమోదా దేవి మాట్లాడుతూ, 1990లో తాను మొదటిసారిగా ప్రశాంతి నిలయాన్ని సందర్శించినట్లు చెప్పారు. సత్యసాయి మైసూర్ ప్యాలెస్‌కు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. మహిళలకు ఆత్మగౌరవం నింపడానికి సత్యసాయి ట్రస్ట్ చేస్తున్న కషి ప్రశంసనీయమన్నారు. యూరోపియన్ దేశాల సలహాదారు పెట్రో కాలినో వ్యాలీ మాట్లాడుతూ సత్యసాయి అందించిన సేవలను అనుసరించి మహిళా ట్రస్టు కార్యకలాపాలలో వారి పాత్ర గొప్పదన్నారు. ఏటా మహిళా దినోత్సవం జరుపుకుంటూ మహిళా శక్తిని సమాజంలో మహిళా పాత్ర గురించి చర్చించుకోవడం మంచి సాంప్రదాయం అన్నారు. సాయంత్రం రఘునాథన్ బందం నిర్వహించిన కచేరి అలరించింది. సత్యసాయి విద్యార్థులు నిర్వహించిన నాటికలు ఆకట్టుకున్నాయి.

నూతన కేథరైజ్ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్ ను ప్రారంభించి పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునికి కేదారైజేషన్ లేబరేటరీని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ ఆదివారం ప్రారంభించారు. ఆదివారం ప్రశాంతిగ్రామ్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ.4.2 కోట్లతో ఈ లేబరేటరీని నిర్మించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, కార్డియాలజీ విభాగంకు ఈ లేబరేటరీ అనుసంధానంగా ఉంటుందన్నారు. హృదయ సంబంధ వ్యాధులను నిర్ధారించడానికి, చికిత్సలు అందించడానికి ఉపయోగ పడుతుందన్నారు. రోగ నిర్ధారణ చేయడం, గుండెకు సంబంధించిన వ్యాధులకు మెరుగైన చికిత్సలు అందించడానికి ల్యాబ్ ద్వారా సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానంద, నిమీస్‌పాండే, ఆస్పత్రి డైరెక్టర్ గురుమూర్తి, డాక్టర్ విఆర్‌అయ్యర్, కార్డియాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కల్టెరేట్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు, ఎపి రైతుసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, సిఐటియు ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్టమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. బ్యాంకుల్లోని లక్షల కోట్లను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని విమర్శించారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోదీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై

బుక్‌లెట్ ఆవిష్కరణలో నాయకులు

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణ, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గుడికట్ల సంబరాలు

◆ నగరంలో భారీ ర్యాలీ
◆ భీరప్ప స్వాముల ఊరేగింపు
◆ హెలీక్యాప్టర్‌లో పూల వర్షం

గుడికట్ల కార్యక్రమంలో పాల్గొని కురుబ కులస్తులకు అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కురబలకు సంబంధించిన గుడికట్ల ఉత్సవాలు ఆదివారం నాడు అనంతపురం నగరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. 800 సంవత్సరాల తరువాత ఈ ఉత్సవాన్ని ఇంత పెద్దఎత్తున నిర్వహించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉత్సవానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 252 గుడికట్లు ట్రాక్టర్లపై ఊరేగిస్తూ తీసుకొచ్చారు. బళ్లారి బైపాస్ నుంచి జూనియర్ కళాశాల వరకు ట్రాక్టర్లలో వీటిని తీసుకొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని టవర్ క్లాక్, సప్తగిరి శ్రీకంఠం సర్కిళ్లు, కళ్యాణదుర్గం రోడ్డు, జెఎన్‌టియు, ఎస్‌కెయు రోడ్డు పలు ప్రాంతాల్లో కురబలు భారీ ర్యాలీలు ఊరేగింపులు చేపట్టారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ కురుబల ప్రదర్శనలతో నిండిపోయాయి. ఈ సమయంలో పెద్దఎత్తున ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, జూనియర్ కళాశాల మైదానం వరకు భీరప్ప స్వాములను ఊరేగించారు. అన్ని స్వాములను ఒకచోట ఉంచి పూజలు నిర్వహించారు. 250 గుడికట్లకు హెలీక్యాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు. లహరి డ్యాన్స్ అకాడమీ, మక్బూల్ అకాడమీల ఆధ్వర్యంలో చిన్నారులు, యువత సాంప్రదాయ, జానపద, వెస్టర్న్ నృత్యాలతో అలరించారు. గొరవయ్యల విన్యాసాలు, ఉరుములు, డ్రమ్స్ వాయిద్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సంబరాలకు మంత్రి ఉషాశ్రీచరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, టిడిపి శ్రీసత్యసాయి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు బికె.పార్థసారథి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ కురుబ యాదవ సాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ శివబాలతోప ఆటు పెద్ద ఎత్తున కురుబలు హాజరయ్యారు. కురుబల ఐక్యతను బలపరిచేలా నాయకులు అభివాదాలు చేశారు. ఎనిమిది సంవత్సరాల క్రితం కురుబల ఉనికిని చాటే గుడికట్ల సంబరాలు తిరిగి ప్రజలకు తెలిసేలా కురుబల ఐక్యతను మరింత పటిష్టపరిచేలా ఈ ఉత్సవాలను మొట్టమొదటిసారి అనంతపురం జిల్లాలో నిర్వహించటం గర్వకారణంగా ఉందని శ్రీనివాసులు ఉన్నారు. 252 గుడికట్లను కలిపి నగరంలో ఊరేగింపు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం గౌరవాధ్యక్షులు నారాయణ, ట్రెజరర్ నాగన్న, కళ్యాణమండపం ప్రతినిధి కొనకొండ్ల, రాజేష్, లక్ష్మి, పిడుగు కృష్ణమూర్తి, కురుబ సంఘం నేతలు ఎమ్‌డీ నాగభూషణం గురువు నారాయణస్వామి పాల్గొన్నారు.

గుడికట్లలో రాజకీయరచ్చ..!

◆ టిడిపి వర్సెస్ వైసిపిగా మారిన బహిరంగసభ
◆ వేదికపైనే నాయకుల మధ్య తోపులాట

సభావేదికపై వాదించుకుంటున్న ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి

కురుబలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుడికట్ల కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. నేతలు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. కురబలంతా ఐక్యంగానున్నారు.. నాయకులే సరిగాలేరని ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యాఖ్యలు చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు నిదర్శనం వేదికపైనున్న నాయకులేనని బికె.పార్థసారధిని ఉద్దేశించి మాట్లాడారు. దీంతో పార్థసారధి, గోరంట్ల మాధవ్ మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇద్దరు నేతలకు సంబంధించిన మద్దతుదారుల మధ్య తోపులాట జరిగింది. వారి అనుచరులు కూడా వేదికపైనే ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. సాంప్రదాయాల కోసం కురుబల ఐక్యత కోసం ఏర్పాటు చేసిన వేదిక ఒక్కసారిగా రాజకీయ వేదికగా మారింది. దీంతో బహిరంగ సభకు వచ్చిన కురబకులస్తులు అందరూ ఒక్కసారిగా అవాక్కు అయ్యారు. కురుబల ఐకమత్యం కోసం ఏర్పాటు చేసిన స్టేజీపైన ఇలా వ్యవహరించడం సరైంది కాదని సంఘం నాయకులు తెలిపారు. పోలీసులు కూడా అక్కడికి చేరుకుని సర్దిజెప్పారు. అక్కడి నుంచి గోరంట్ల మాధవ్, మంత్రి ఉషశ్రీచరణ్ వెళ్లిపోయారు. సభావేదికపై ఉన్న ఇతర నేతలు, పోలీసులు కలుగజేసుకుని దూషణలు చేసుకుంటున్న వారికి సర్దిచెప్పి శాంతింపజేశారు. దేవుడి కార్యం వెనుక రాజకీయం ఏమిటంటూ అక్కడున్న వాళ్లంతా నేతలపై అసహనం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌నే బోల్తా కొట్టించిన ఘనులు...!

◆ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులకు సమచారం లేదు... ◆ హాజరైన ఇతర జిల్లాల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం దేవరపల్లి సమీపంలో ఉన్న గోళాపురం పారిశ్రామిక వాడలోని శ్యామ్ ఫెర్రస్ లిమిటెడ్, ఎంఎస్ బిల్లేట్లు టిఎంటి బార్‌లు తయారీ పరిశ్రమల విస్తరణ కోసం ఈ నెల 15న బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల నిర్వహకులు కలిసి సాక్షత్తు జిల్లా కలెక్టర్‌నే బోల్తా కొట్టించారు. ప్రజాభిప్రాయ సేకరణకు తప్పకుండా గ్రామంలో దండోర వేయించి అందరికీ సమచారం ఇచ్చి అభిప్రాయ సేకరణ చేయాల్సి ఉండగా ఇతర జిల్లాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, సర్పంచి ఆయన కావాల్సిన పది మందితో తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చేతులు దులుపుకున్నారు.

రాష్ట్రంలోనే మూడవ అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంలో ఉన్నాయి. ఇక్కడ చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 130 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల నిర్వహకులు నిబంధనల మేరకు కార్పొరేట్ సామాజిక భాధ్యత కింద గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యం ఉంది. అయితే కేవలం లాభార్జనే లక్ష్యంగా కార్పొరేట్ సామాజిక బాధ్యతను మరచి స్వలాభాన్ని చూసుకుంటున్నారు. బంగారాన్ని పండించే భూములను ఇచ్చిన రైతులకు పారిశ్రామిక వేత్తలు కాలుష్యాన్ని బహుమతిగా ఇస్తున్నారు. దీనిపై ఎవరైన ప్రశ్నిస్తే నష్టాలను చూపిస్తున్న పారిశ్రామికవేత్తలు వారి పరిశ్రమలను ఏ విధంగా విస్తరణ చేస్తున్నారో ఆర్థం కావాడం లేదు. ఇప్పటికే గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్నా శ్యామ్ ఫెర్రస్ లిమిటెడ్, ఎంఎస్ బిల్లేట్లు టిఎంటి బార్‌లు తయారీ పరిశ్రమల నిర్వహకులు వారి పరిశ్రమలను విస్తరించడానికి ప్రభుత్వనికి ధరఖాస్తు చేసుకున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి

పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న పొగ

అధికారులు గత బుధవారం రూరల్ మండలం దేవరపల్లి వద్ద కలెక్టర్ అధ్యక్షతన పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పివి.కిషోర్ రెడ్డి, ఎపిపిసిబి ఎఈఈ కృష్ణారెడ్డిలు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ రెండు పరిశ్రమల నిర్వహకులు పరిశ్రమను స్థాపించి ఆయా గ్రామాల అభివృద్ధికి చేసింది శూన్యం. కనీసం స్థానికులకు ఉపాధి సైతం కల్పించలేదు. అయినప్పటికీ మరింత భూమిని కేటాయించి, పరిశ్రమల విస్తరణ కోసం గుట్టుచప్పుడు కాకుండా పరిశ్రమల నిర్వహకులు ఇస్తున్న మాముళ్ల తీసుకుని అనుమతులను ఇవ్వాడానికి అధికారులు సిద్ధం అయ్యారు. ఇది చాలదన్నట్లు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లాలతో పాటు హిందూపురం ప్రాంతంలో ఉన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులకు సమచారం లేదు. ఇక్కడ గమ్మత్తే మిటంటే ప్రజాభిప్రాయ సేకరణలో బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వచ్చి పరిశ్రమల విస్తరణకు అనుకూలంగా మాట్లాడడం, నివేదికలు ఇవ్వడం చూస్తుంటే స్థానికులు నివ్వెరపోతున్నారు. కనీసం స్థానికంగా ఉన్న పాత్రికేయులకు సైతం సమచారం ఇవ్వలేదంటే ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఎలా నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు. ప్రజాభిప్రాయ సేకరణలో తమకు అనుకూలంగా కొంతమంది చేత చెప్పించేందుకు స్థానికంగా కొంత

ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్ (ఫైల్ ఫొటో)

మంది ప్రజాప్రతినిధులు, అధికారులకు పరిశ్రమల వారు లక్షలాది రూపాయలు ముట్ట చెప్పినట్టు వార్తలు వినపిస్తున్నాయి.

తూమకుంట, గోళాపురంలో ఉన్న పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వల్ల ఇప్పటికే పరిశ్రమల చుట్టు పక్కల గ్రామాల వారు ఎన్నో వ్యాధులకు గూరి అవుతున్నారు. ఇది చాలదన్నట్లు చేతికి వస్తున్న పంటులు సైతం పరిశ్రమల వల్ల తమ గ్రామంలో ప్రజలు పలు ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారని, పశువులకు తాగునీరు, పంట పొలాలకు సాగునీరు అందకుండా పోతుందని గగ్గోలు పెడుతున్నారు. అయినా అధికారులకు ఇవేమీ పట్టలేదు. తమకు ముడుపులు ముడితే ప్రజల ఆరోగ్యాలతో పనేమీ అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలు వస్తాయని అనుకుంటే రోగాలు వచ్చే పరిశ్రమలు వచ్చాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాలపై ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సంప్రదిస్తే వారి నుంచి నిర్లక్ష్య సమాధానాలే వస్తున్నాయి. ఇప్పటికైన కలెక్టర్ వీటిపై ప్రత్యేక దృష్టి సారించి తూమకుంట, గోళాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను కాలుష్యం నుంచి కాపాడాని ఇక్కడివారు కోరతున్నారు.

22న 'దళిత సామాజిక న్యాయం' రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం' అనే అంశంపై ఈనెల 22న విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మనువాద మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, గిరిజన, ముస్లిం, క్రైస్తవులపై దాడులు

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పెరిగిపోయాయన్నారు. పౌర హక్కులను కాలరాస్తూ మతోన్మాద భావజాలాన్ని పెంచి పోషిస్తోందన్నారు. దేశ అభివృద్ధికి దళితులు, అట్టడుగు వర్గాలకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరణ చేస్తూ దళితులకు ఉద్యోగ అశకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. దేశాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తూ పెట్టుబడిదారీ విధానాన్ని విచ్చలవిడిగా ప్రోత్సహిస్తోందన్నారు. దళితులకు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రజాస్వామ్య డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనుధరమ్మ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి 22న విశాఖపట్టణంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంత పురం కలెక్టరేట్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ ఆధ్వర్యంలో ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డిప్యూటీ డైరెక్టర్ సి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, గ్రంథాలయ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి వ్యవహరించారు. సాయంత్రం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, గ్రంథాలయ ఉప అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, అడ్వకేట్ నర్మద, డిగ్రీ కళాశాల లెక్చరర్ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దిశా చట్టం, మహిళా సాధికారితపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ ఎల్.ఎం.మోహన్‌రెడ్డి, కార్యదర్శి రమ, స్థానిక అధికారిణి జి.నల్లమ్మ, కస్తూరిబా పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినులు

బిగ్ స్క్రీన్‌పై క్రికెట్ వీక్షణం

రాయదుర్గం : ఇండియా, ఆస్ట్రేలియా నడుమ ఆదివారం జరిగిన వరల్డ్‌కప్ క్రికెట్ ఫైనల్ పోటీని బిగ్ స్క్రీన్‌పై ప్రజలు, యువత వీక్షించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాయదుర్గం యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ వద్దకు భారీగా యువత, ప్రజలు తరలివచ్చి వీక్షించారు.

రాయదుర్గంలో బిగ్ స్క్రీన్‌లో క్రికెట్‌ను వీక్షిస్తున్న జనం

రోడ్లన్నీ నిర్మానుష్యం

నార్పల : ఇండియా-ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి మండల కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మాణుష్యమయ్యాయి. దాదాపు కరోనాలో నెలకొన్న పరిస్థితులు కనిపించాయని చెప్పవచ్చు. సందుల్లో సైతం జన సంచారం కనిపించలేదు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ టీవీలకే అతుక్కుపోయారు. మరికొందరు క్రీడాప్రియులు ఇండియా వరల్డ్ కప్ గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో యూనిట్ మహాజన సభ నిర్వహంచారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు లిఖిత స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మూడేళ్లకు అనంతపురం కమిటీ ప్రెసిడెంట్‌గా సుజాత, సెక్రటరీగా సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్, నారాయణరెడ్డి, రామారావు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత

ఇందిరా గాంధీకి నివాళి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ముఖ్యంగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సోనియా శీన, అంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రేగటి చెన్నప్ప, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, మండల కన్వీనర్ ఇంద్రావతి ఓబులేసు, రాఘవేంద్రయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు

వ్యాస రచన పోటీలు

విద్యార్థులతో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంత పురం కలెక్టరేట్

అనంతపురంలోని విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏ.జీ రాజమోహన్ ప్రారంభించారు. పండుగలు, పేదరికం, మూఢనమ్మకాలు, ఆత్మవిశ్వాసం అంశాలపై 1వ రోడ్డులోని శారద హైస్కూల్ విద్యార్థులు పోటీలు నిర్వహించారు. 125 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ పి.శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, జన విజ్ఞాన వేదిక ముత్యాలు, డీవైఎఫ్ఐ బాలకృష్ణ, యుటిఎఫ్ సురేష్, ఎన్ఎంటి శ్రీనివాసరాడు, కో కన్వీనర్ వందన, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో బెడ్‌షీట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

సవాబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలోని విఠల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు జి.వన్నూర్‌సాహెబ్ మాట్లాడుతూ సమాజం మనకెంతో ఇచ్చిందని, తిరిగి కొంతైనా ఇవ్వాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే చలికాలంలో వృద్ధులు చలికి ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో బెడ్‌షీట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సవాబ్ స్వచ్ఛంద సేవ సంస్థ కమిటీ సభ్యులు కొత్త రవి, తలారి మల్లి, ఎ.నబిరసూల్, నూర్జాహాన్, వన్నూరమ్మ, కోమల, సల్మా భాను, వృద్ధులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న సవాబ్ సేవా స్వచ్ఛంద సభ్యులు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి

ప్రజాశక్తి-ఉరవకొండ

జిపిఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి డిమాండ్ చేశారు. ఆదివారం వజ్రకరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే తాము అధికారంలోకి వచ్చిన వారంలో రోజుల్లోనే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఒపిఎస్ పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల అవుతున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసి వచ్చే అన్ని సంఘాలను కలుపుకుని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ 117 జీఓ ద్వారా పాఠశాలలు మెర్జ్ చేసి 3 నుంచి 5 తరగతులను ఉన్నత పాఠశాలలో కలపడం వల్ల విద్యార్థుల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. అంతేగాకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయన్నారు. కావున జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వజ్రకరూరు మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసగుప్తా, అధ్యక్షులుగా జయరాములు, సహాధ్యక్షులుగా పావనమురళి, శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులుగా రామచంద్రనాయక్, మోహన్, రాంబాబు, రామచంద్ర, సుధాకర్, మల్లేశ్వరి, మధుబాబు, ఆంజనేయులు, శాలెంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ నూతన కమిటీ సభ్యులు

ఓట్ల తొలగింపుపై విచారణ చేపట్టాలి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజక వర్గంలో ఓట్ల తొలగింపుపై ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ చేపట్టాల ని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాయదుర్గ ంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తప్పుడు హామీలు ఇవ్వడంతోపాటు దొంగ ఓట్లు, డబ్బు వెదజల్లి గెలవాలని కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇందులో భాగంగానే టిడిపి సానుభూతిపరులకు చెందిన 32,279 ఓటర్లను జాబితా నుంచి తొలగించారన్నారు. నియోజకవర్గంలో 8094 మంది ఓటర్లు మృతి చెందినట్లు, 739 మంది పేర్లు రెండేసి చోట్ల ఓటర్ల జాబితాలో నమోదైనట్లు, 110 మంది ఓట్ల నమోదు తప్పుగా ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైందన్నారు. 12067 ఓట్లు తొలగించాలని తాము ఫిర్యాదు చేస్తే 32,279 మంది పేర్లను తొలగించాలని వైసిపి కమిషనర్‌ను కోరిందన్నారు. తమ ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. అయితే అధికార వైసిపి తప్పుడు ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటే ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. వైసిపి సాంకేతికను ఉపయోగించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను పత్రికలు ఎలుగెత్తి చాటితే 'కాపు' కంపరానికి గురయ్యారన్నారు. రాజకీయ కక్షతో ప్రత్యర్థి పేరును తొలగించడం నేరం అవుతుందన్నారు. ఎన్నికల యంత్రాంగం మైక్రో సర్వే చేసి ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలన్నారు. త్వరలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమగ్ర నివేదికను తీసుకెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఇనాయత్ బాషా, మైనార్టీ సెల్ నాయకుడు మహబూబ్ బాషా, మాజీ వార్డు సభ్యుడు టంకశాల హనుమంత, తదితరులు పాల్గొన్నారు.

'గుంతల ఆంధ్రప్రదేశ్'కి దారేదీ'.?

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

'గుంతల ఆసుపత్రికి దారేది..'? అంటూ టిడిపి, జనసేన నాయకులు ప్రశ్నించారు. 'గుంతల ఆసుపత్రికి దారేది..' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గ పరిధిలోని లోలూరు, మదిరేపల్లి, రేగడికొత్తూరు, పొరాళ్ల గ్రామాల్లో ఉన్న గుంతల రోడ్లపై టిడిపి, జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా గుంతల రోడ్లు ఉండటంతో చాలామంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా పొరాళ్ల సమీపంలో రోడ్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనకు మద్దతుగా ప్రజలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు సాకే మురళీకృష్ణ, తోట ఓబులేసు, అంకే ఈశ్వర్, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్ర శేఖర్, జయమ్మ, శశిరేఖ, తోట ఓబులేసు, ఉపాధ్యక్షులు సాయిశంకర్, మధుసేఖర్, తోట రామమోహన్, భాస్కర్, కుళ్లాయి, హరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని పుట్లూరు-తాడిపత్రి మెయిన్ రోడ్డులో టిడిపి నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా మైనారిటీ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి అవినీతి అక్రమాలు తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతల దర్శనమిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమం టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి

శింగనమల : మండలంలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు ఈడిగ పుల్లప్ప సోదరుడు ఈడిగ మార్కండేయ మృతికి డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి నివాళులర్పించారు. మర్కండేయ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న శ్రీరామిరెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో వెస్ట్ నరసాపురం సర్పంచి గుజ్జల వెంకటరాముడు, వైసిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజలాల పంపిణీ గెజిట్‌ను వెనక్కు తీసుకోవాలి

పెద్దపప్పూరు : కేంద్ర ప్రభుత్వం కృష్ణాజిల్లాల పున్ణపంపిణీ గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే వెనక్కు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి చింత పురుషోత్తం డిమాండ్ చేశారు. గెజిట్ నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో నిర్వహించనున్న 30 గంటల దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో హరే రామ ఆశ్రమం ఆవరణలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి బోగతి రామేశ్వర్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి టి.రామకృష్ణ, కాసెట్టి నారాయణస్వామి, హాలో కిట్ట, వడ్డీ రామాంజనేయులు, బొమ్మల చంద్రనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'గుడికట్ల'కు తరలిన కురుబలు

ఉరవకొండ : అనంతపురంలో జరిగిన కురుబల గుడికట్ల సంబరాలకు కురుబ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు డోనేకల్ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం భారీగా తరలివెళ్లారు. మండల పరిధిలోని డోనేకల్, గడేకల్, కడదలబెంచి, కరకముక్కల, విడపనకల్ తదితర గ్రామాల నుంచి దాదాపు 1500 మంది బయలుదేరారు. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో జరుగుతున్న గుడికట్ల సంబరాలకు జిల్లావ్యాప్తంగా 218 మంది గుడికట్ల దేవుళ్లకు వేలాదిమంది భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. అనంతపురం వెళ్లినవారిలో గుమ్మనూరు మారెన్న, ఉల్తెప్ప, తదితరులు ఉన్నారు.

అవార్డు అందుకుంటున్న ఎస్‌వి కళాశాల ప్రిన్సిపల్ వై.మధుసూదన్‌రెడ్డి

ఎస్‌వి కళాశాలకు ఎమర్జింగ్ అవార్డు

అనంతపురం : ఎడ్యు స్కిల్స్ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కార్యక్రమంలో అత్యుత్తమ సహకారం, అత్యుత్తమ పని తీరు కనబరిచిందుకు స్థానిక జీసెస్ నగర్‌లో ఉన్న ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలకు 'ఎమర్జింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్ - 2023' అవార్డు లభించింది. ఈమేరకు గోవాలో జరిగిన సన్మాన కార్యక్రమంలో 'ఎడ్యు స్కిల్స్ ఫౌండేషన్' ప్రముఖులతో కళాశాల ప్రిన్సిపల్ వై.మధుసూదనరెడ్డి అవార్డును అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డును పొందడంపై సంస్థ ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలు పంపిణీ

మొక్కలను పంపిణీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన ఒక వివాహ వేడుకలో ప్రముఖ మోటివేటర్, అనంతపురానికి చెందిన ఏలుగు సురేష్‌కుమార్ దాదాపు 600 మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మొక్కలు అందించారు. ఇదివరకే అనంతపురంలో సురేష్‌కుమార్ పదివేల మొక్కలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు ఎంజి వీరన్న, కంబాల తిమ్మారెడ్డి, చిన్నమల్లగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ఎంపిపి వెలిగొండ నరసింహులు

ఉరవకొండ : ఉరవకొండ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా తన ఎన్నికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని ఆదివారం ఆయన స్వగృహంలో ఎంపిపి వెలిగొండ నరసింహులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించడమే కాకుండా మండలంలో వైసిపిని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతిచెందిన సునీల్‌కుమార్

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం గుత్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మునిసిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి గోవిందు కుమారుడు సునీల్‌కుమార్(40) కొన్ని రోజులుగా మానసిక స్థితి బాగోలేక బాధ పడుతుండేవాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన సునీల్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పట్టించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు సునీల్‌కుమార్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యాదగిరికి చెందిన బీమా శంకర్, నాగరాజు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా జనగిరి వద్ద రహదారిపై కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ బీమా శంకర్, నాగరాజు లను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అలాగే మండలంలోని లచ్చానుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. లచ్చానుపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు గుత్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా గ్రామ సమీపంలో రహదారిపై గొర్రెల మందను తప్పించపోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ పెద్దిరాజును చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనాథాశ్రమంలో వృద్ధురాలు మృతి

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న వృద్ధ, అనాథాశ్రమంలోని సంతోషమ్మ (65) మృతిచెందింది. బత్తలపల్లికి చెందిన సంతోషమ్మ ఎనిమిదేళ్లుగా అనాథాశ్రమంలో ఉంటుంది. కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురైన ఆమె ఆదివారం మరణించింది. వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా ఆశ్రమంలో ఉన్న వద్ధురాలి మతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లికార్జున, షఫీ, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి

మృతిచెందిన నరసింహులు

బ్రహ్మసముద్రం : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న బోయ దాసరి నరసింహులు (33) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. దాసరి నరసింహులు ఐదేళ్ల నుంచి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగానే ఆదివారం విధులకు హాజరైన నరసింహులు ఆసుపత్రి ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ ఉన్నట్టుండి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రిలోకి తరలించి చికిత్స అందించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కళ్యాణదుర్గం తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. నరసింహులుకు భార్య శోభ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపించారు.

ఆత్మవిశ్వాసం కలిగించేదే సాహిత్యం

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

పురస్కార ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలను జాగృతం చేసి ఆత్మవిశ్వాసం పెంపొందించే శక్తి సాహిత్యానికి ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ భవన్‌లో డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్ కవిత్వ వేదికపై ఆదివారం 'స్పందన' అనంత కవుల వేదిక-2022 సాహిత్య పురస్కార ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కవిత్వం సాహసవంతుని ఆయుధం అన్నారు. రేపటి కలల సాకార సౌధమని, అణగారిన జాతుల అభ్యున్నతి కేంద్రంగా సమున్నత మానవతా దృష్టితో కవిత్వం రాసిన ఐదుగురు కవులకు ఈ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. పురస్కారాలను ఉద్యమ కవి కృపాకర్ మాదిగ, సుంకర గోపాలయ్య, రాఘవేంద్ర, కె.నాగేశ్వరాచారి, నెల్లూరు కవి పేరిశెట్ల శివకుమార్, యములపల్లి నర్సిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంత కవిత్వ వికాసానికి స్పందన సంస్థ 20 ఏళ్లుగా చేస్తున్న కృషిని వక్తలు అభినందించారు. ఈ సభలో సాహితీవేత్తలు, రచయితలు, కవులు తూముచర్ల రాజారాం, ఉప్పరపాటి వెంకటేశులు, కె. నాగేశ్వరాచారి, యములపల్లి నర్సిరెడ్డి, చిలుకూరి దీవెన, శాంతి నారాయణ, తరిమెల అమరనాథ రెడ్డి, గోవిందరాజులు, మధుర శ్రీ, వన్నప్ప, రియాజ్, షరీఫ్, ఈరన్న, మిద్దె మురళి, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పేర వేధిస్తున్న వైసిపి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు - ఏడు కేసుల్లో పోలీసుల నోటీసులు

నోటీసుపై సంతకం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి ప్రభుత్వం తనను కావాలనే కేసుల పేరుతో వేధిస్తోందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి చేపట్టిన ఆందోళనలపై నమోదైన కేసులకు సంబంధించిన నోటీసులను ఆదివారం రాయదుర్గంలోని కాలవ నివాసంలో పోలీసులు కలిసి నోటీసులు అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానికంగా చేసిన ఆందోళనలపై ఏకంగా ఆరు కేసులు నమోదయ్యాయి. అంతకుముందు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రి ఎదురుగా జరిగిన నిరసన సమయంలో మరో కేసు పెట్టారు. వీటన్నింటిలోనూ కాలవ శ్రీనివాసులును మొదట నిందితుడిగా చేర్చారు. మొత్తం ఏడు కేసులకు సంబంధించి రాయదుర్గం పోలీసులు పట్టణంలోని కాలవ నివాసంలో ఆయనకు నోటీసులు ఇచ్చారు. సదరు కేసుల్లో విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరు కావాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు ఉంటాయని నోటీసుల్లో పేర్కొన్నారు. అనంతరం విలేకరులతో కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా పాలకులు హరిస్తున్నారన్నారు. తానెప్పుడూ చట్టవ్యతిరేకంగా వ్యవహరించకపోయినా వరుస కేసులతో ప్రభుత్వం తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తోందన్నారు. తనతో పాటు నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులపై అనేక కేసులు పెట్టారన్నారు. ఈ కేసుల బూచి చూపి తమను ఎన్నికల సమయంలో ఇబ్బంది పెట్టడానికే చీటికీ మాటికి కేసుల్లో ఇరికిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లలో 15కుపైగా కేసులు తనపై నమోదు చేశారన్నారు. తనను ఒక చట్టవ్యతిరేక శక్తిగా చూపాలని జగన్ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఒత్తిడి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతోనే తనపై ఇష్టానుసారంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు నమోదు చేసినా ప్రజల పక్షాన తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు.